

బాబూరావు మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సిపిఎం పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్మిక నేత చింతకాయల బాబూరావు మృతికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. అనారోగ్యంతో రాజమహేంద్రవరంలో ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఆరోగ్యం విషమించి గురువారం మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తులసి, జువ్వల రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్-ఎస్.మూర్తి, కెఎస్‌వి.రామచంద్రరావు, పూర్ణిమరాజు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, సీనియర్ నాయకులు టి.ప్రకాష్, సావిత్రి, నాయకులు రాంబాబు, ప్రజాశక్తి మేనేజర్ డి.శ్రీనివాస్, నివాళులర్పించారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

- టమాటా బాక్స్ రూ.1000
- కిలో మునగ కాయలు రూ.100
- మార్కెట్‌కు తగ్గిన దిగుమతులు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. మొన్నటివరకూ అందుబాటులో ఉన్నా ప్రస్తుతం ఒక్కసారిగా పెరిగాయి. ప్రతి కూరలోనూ రుచి కోసం వినియోగించే టమాటా 25 కిలోలు బాక్స్ రూ.1000 ధర పలుకుతోంది. అంటే హోల్‌సేల్‌గా కిలో రూ.40 కాగా, చిల్లరగా కిలో ధర రూ.50 పలుకుతోంది. ఇక మార్కెట్ నుంచి టమాటా బహిరంగ మార్కెట్‌లోకి, గ్రామాలలో వీధులలోకి వచ్చిన తర్వాత కిలో రూ.50 నుంచి రూ.60లకు పైగానే ధర ఉంది.

జిల్లాలో మొంథా తుపాను కారణంగా 171 ఎకరాల్లో కూరగాయల పంటలు నష్టం జరిగిందని అధికారుల ప్రాథమికంగా అంచనా వేశారు. అదేవిధంగా టమాటా సాగు చాలా తక్కువ కావడంతో, మార్కెట్‌లోని వ్యాపారులు అనంతపురం, చిత్తూరు, మదనపల్లి, కర్నూలు, డోన్, కర్నాటకలోని చంతామణి, కోలారు తదితర ప్రాంతాలు నుంచి దిగుమతి చేసుకుంటారు. అక్కడ కూడా పంట నష్టం జరగటం, మరోవైపు కార్తీక మాసం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కూరగాయలకు డిమాండ్ పెరగటంతో ఇటీవల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. గతంలో రోజుకు 1200 బాక్స్‌లు మార్కెట్‌కు రాగా, వారం రోజుల నుంచి కేవలం 800 బాక్స్‌లు మాత్రమే వస్తున్నాయి. వారం రోజుల క్రితం బాక్స్ ధర రూ.500 ఉండగా, ప్రస్తుతం ధర రెట్టింపు పలుకుతోంది. అదేవిధంగా మునగ కాయలు స్థానికంగా దిగుబడి లేకపోవడంతో చెన్నై నుంచి వస్తున్నాయి. అవి కూడా సక్రమంగా రావడం లేదు. ప్రస్తుతానికి కిలో మునగ వంద రూపాయలు ధర పలుకుతోంది. అవి కూడా మార్కెట్‌లో లభించడం లేదు. అయ్యప్ప, ఇతర మాలధారులకు వివిధ దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు పెరగడంతో కూరగాయలకు మరింత డిమాండు పెరిగింది. జిల్లాలో వరి పంటలతో పాటు కూరగాయల సాగుపై అధిక శాతంగా రైతుల ఆధారపడి జీవిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 17,500 ఎకరాల నుంచి 30,000 ఎకరాల వరకు సీజన్ ఆధారంగా కూరగాయల సాగు జరుగుతుంది. వర్షాలకు, పంట దెబ్బతినడంతో ప్రస్తుతం టమోటాకు డిమాండ్ పెరిగింది. చిక్కుడు కిలో రూ.60కు లభించేంది. రూ.80కి పెరిగింది. గోరు చిక్కుడు ధర కిలో రూ.25 నుంచి రూ.60కి, వంకాయ కిలో రూ.30 నుంచి రూ.70కి, కాకరకాయ కిలో రూ.35 నుంచి రూ.50, బెండకాయ కిలో రూ.30 నుంచి రూ.40, బీరకాయ కిలో రూ.40 నుంచి రూ.70కి, బీన్స్ కిలో రూ.40నుంచి రూ.60, క్యాప్సికం రూ.40 నుంచి రూ.60, క్యాబేజీ పువ్వు రూ.20 నుంచి రూ.30, పూదీన రూ.30 నుంచి రూ.80, కొత్తిమీర రూ.20 నుంచి రూ.30, ములక్కాడలు ఒక్కటి రూ.5నుంచి రూ.15, క్యారెట్ రూ.30 నుంచి రూ.50లకు పెరిగింది. బంగాళదుంపలు కిలో రూ. 30 నుంచి రూ. 40 చేరాయి. పెరిగిన ధరలు కొనుగోలుదారులకు చమటలు పట్టిస్తున్నాయి.



గోకవరంలో పంట నష్టంపై ఆరా తీస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన

జిల్లాలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా యంత్రాంగం గురువారం పర్యటించింది. గోకవరం, కడియం మండలాల్లో కలెక్టర్ కీర్తి చేకూరి పర్యటించారు. పంట నష్టం గణనను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

గోకవరం మండలంలో పలు గ్రామాల్లో కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం వివరాలు ప్రత్యక్షంగా తెలుసుకుని రైతులతో మాట్లాడారు. పంట నష్టం గుర్తింపు పనులు వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సకాలంలో సహాయం అందించేందుకు నష్ట అంచనాలను అన్ని ప్రభుత్వ శాఖల విభాగాలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, డ్వామా పీడీ ఎం.నాగమహేశ్వరరావు, తహశీల్దార్ పి.రామకృష్ణ, ఎంపిడిఒ గోవింద్, మండల వ్యవసాయ అధికారి రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు శిరీష, రమకుమారి పాల్గొన్నారు. **కడియం** మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. పంట నష్టం వివరాలను ప్రత్యక్షంగా తెలుసుకుని రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, తహశీల్దార్ సునీల్‌కుమార్, ఎంపిడిఒ రమేష్, ఎఒ పివి.శ్రీనివాస్, హెచ్‌ఒ పి.లావణ్య, విఆర్‌ఒలు పాల్గొన్నారు. **పెరవలి** మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో తుపాను ప్రభావంతో దెబ్బ తిన్న అరటి తోటలను డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వన యూనివర్సిటీ శాస్త్రవేతల బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఉద్యాన వన శాస్త్రవేతలు డాక్టర్ టి.నాగలక్ష్మి, డాక్టర్ జి.రంగన్న తదుపరి తీసుకోవాల్సిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పర్యటనలో రవింద్‌సాయి, రాణి, రైతులు పాల్గొన్నారు. **సీతానగరం** మండలంలో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను శాస్త్రవేత్తలు, ఉద్యాన వన శాఖ అధికారులు పరిశీలించారు. పలు రకాల పంట పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పుష్ప దెబ్బతిన్న తోటల్లో రైతులు తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన ఎరువులు, పురుగు మందులను వివరించారు. ఈ పర్యటనలో కొరుకొండ ఉద్యాన వన అధికారి పి.రినీ, ఎక్స్టెన్షన్ అధికారి సౌమిత్రి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సింగవరంలో ఆర్‌డిఒ కృష్ణనాయక్ పర్యటించారు. తుపాను ప్రభావంతో నేల కొరిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ అంకం శ్రీనివాస్, ఎంపిడిఒ ఎం.భారతి, ఎఒ గౌరీదేవి, సర్పంచ్‌లు సంగన చినపోశయ్య, కొంచ అన్నపూర్ణ, రైతులు పాల్గొన్నారు. **కొవ్వూరు** మండలంలోని కుమారదేవం గ్రామంలో తుపాను ప్రభావిత పంట పొలాలను సహాయ వ్యవసాయ సంచాలకులు చింతల శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. పంట నష్టం జరిగిన రైతులందరూ వారి పొలాలు గ్రామ వ్యవసాయ సహాయకులకు చూపించి పట్టదారు పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలతో నమోదు చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి గంగాధర్, రైతులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలోని కాల్దరి, వేలివెన్ను తదితర గ్రామాలల్లో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ శ్రీనివాస్, ఎఒ బి.రాజారావు, రైతులు విశ్వనాథం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

4న ఐటిఐ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఆదానీ గ్రూప్ నిర్వహిస్తున్న ఫైనాన్షియల్ ఇంక్లూజన్ ఫెసిలిటేషన్స్ ప్రాజెక్టులో పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల కోసం నవంబర్ 4న రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఐటిఐలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్.సునీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు అర్హులని తెలిపారు. మొత్తం 60 ఖాళీలు ఉన్నాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.19వేల వేతనంతో పాటూ పిఎఫ్ సదుపాయం ఉంటుందన్నారు. ఎంపికైన వారు ఆపరేషన్, మెయింటెనెన్స్ విభాగంలో పని చేయాల్సి ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం, నిడదవోలు, గోపాలపురంలో ఉద్యోగ నియామకాలు ఉంటాయన్నారు. అర్హత కలిగిన వారు 4వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7981308986 లేదా 9666722980 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు

ప్రజాశక్తి - చాగల్లు

సంచార జీవితం గడుపుతున్న చెంచులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కెకె.దుర్గారావు, రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు డిమాండ్ చేశారు. బుధవారం చాగల్లు శివారు మీనానగరం ప్రాంతంలోని క్వారీలో నివాసముంటున్న చెంచులను వారు పరామర్శించారు. వర్షాలు వచ్చినప్పుడల్లా గుడెసెలు దెబ్బతింటున్నాయని స్థానికులు వీరమ్మ, గడ్డం వెంకటలక్ష్మి వివరించారు. గత 20 ఏళ్లుగా పూరి గుడెసెల్లోనే జీవనం సాగిస్తున్నట్లు సిపిఎం నాయకులకు తెలిపారు. తుపాను ప్రభావంతో తామంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రంలోనే జీవనం సాగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా తాత్కాలిక గుడెసెల్లో జీవనం సాగిస్తున్న 17 కుటుంబాలకు సత్వరమే ఇళ్ల స్థలాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల స్థలాలతోపాటు, పక్కా గృహాలు నిర్మించుకునేందుకు రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పంటలను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - చాగల్లు

మొంథా తుపాను ప్రభావంతో నేలకు ఒరిగిన వరి, ఇంతర వాణిజ్య పంటలను సిపిఎం నాయకులు సుందరబాబు ఆధ్వర్యంలో బృందం పరిశీలించింది. చాగల్లు గ్రామంలో లంక పొలాల ఏరియాలో రైతులను కలుసుకుని జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. చేతికందిన పంట కళ్లేదుటే నాశనం అయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో వారం పది రోజుల్లో వరి పంటను కోతలు కోసేవారమని రైతులు వివరించారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ తుపాను వల్ల నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు నష్టం లేకుండా ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ చేతికొచ్చిన పంట నీటిలో మునిగిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో నష్ట గణన చేయించి నష్ట సాయాన్ని రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కోయిలముడి నాగేశ్వరరావు, మామిడాల కేశవరావు, చింతపల్లి శ్రీను, శ్రీరంగం రాము, లక్కోజు రామారావు, పెనిమిన సుబ్బారావు, పినమనేని సుబ్బారావు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ, బీమాను ప్రభుత్వమే భరించాలి

ప్రజాశక్తి - సీతానగరం



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చినకొండేపూడి, రాపాక, రఘుదేవపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో తుపాను ప్రభావంతో నేల కొరిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. వైసిపి పాలనలో పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి, విపత్తు వచ్చినప్పుడు రైతులను ఆదుకునే కార్యక్రమం జరిగిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇన్సూరెన్స్ స్కీంను ఎత్తేసి ఆ భారాన్ని రైతులపైనే వేసిందన్నారు. రబీ సీజన్‌లో ధాన్యాన్ని కూటమి ప్రభుత్వ కొనుగోలు చేయకపోవడంతో దళారులకు తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం తుపాను కారణంగా చేతికి వచ్చే పంట నాశనం కావడంతో రైతులు దయనీయమైన పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని అన్నారు. కావున ప్రభుత్వమే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు, ఇన్సూరెన్స ప్రీమియంను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదని చినకుండేపూడికి చెందిన నంబూరి త్రిమూర్తులరాజు, నంబూరి వెంకటేశ్వరరావు, చోడిశెట్టి దుర్గయ్య, చోడిశెట్టి వెంకన్న, చంపాటి గంగరాజు, కోసూరి నాగరాజు, మేడిశెట్టి సత్యనారాయణ, ఏపుగంటి రామకష్ణ, బైర్రాజు సూర్యనారాయణరాజు తెలిపారు.

బాబూరావు ఆకస్మిక మృతికి సంతాపం

ప్రజాశక్తి - చాగల్లు

సిఐటియు ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చింతకాయల బాబురావు మృతికి సిపిఎం సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మృతికి పార్టీకి, ప్రజాసంఘాలకు ఎంతో తీరనిలోటని సిపిఎం మండల కార్యదర్శి కెకె.దుర్గారావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రైతు సంఘం కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు, యుటిఎఫ్ నాయకులు పిల్లి శ్రీనివాస్‌మూర్తి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

జడ్‌పిటిసి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - చాగల్లు

జడ్‌పిటిసి గారపాటి విజయదుర్గ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం పరామర్శించారు. విజయదుర్గ శ్రీనివాస్ తాత గారపాటి బలరామమూర్తి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు జడ్‌పిటిసి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో నాయకులు ఎస్.రాజీవ్‌కృష్ణ, కరుటూరు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్‌లో...

మండలంలోని విజ్జేశ్వరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి నాయకులు మునికోటి దుర్గారావును, అలాగే స్టంట్ వేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న అదే గ్రామానికి చెందిన టిడిపి గ్రామ అధ్యక్షుడు కొయ్యి శ్రీనివాస్‌ను ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు.

620 ఎకరాల్లో పంట నాశనం

ప్రజాశక్తి - గోపాలపురం

తుపాను ప్రభావంతో మండలంలో 520 హెక్టార్లలో వరి పంట నీటిలో మునిగిపోయిందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఏసుబాబు తెలిపారు. వరితోపాటు, మినుము చేలు 252.6 హెక్టార్లు నీట మునిగిందని, పంట నష్టం జరిగిందనే అంశంపై నివేదికను తయారు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 11 ఎకరాల్లో అరటి, 8 ఎకరాలలో కూరగాయ పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన వన శాఖ అధికారి రమేష్ తెలిపారు.

కేసుల పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి బి.పద్మ గురువారం ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో మానిటరింగ్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో ఫ్యామిలీ కోర్ట్ జడ్జి ఎం.మాధురి వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియమించబడిన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతిపై సమీక్షించారు.



నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

హోమీ జె. బాబాకు ఘన నివాళి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

భారత అణుశక్తి పితామహుడు డాక్టర్ హోమీ జె.బాబాకు ఘనంగా నివాళులర్పించారు. గురువారం ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బాబా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.గౌరినాయుడు, డాక్టర్ హెచ్.సుధాకర్‌రావు పాల్గొని బాబా జీవిత విశేషాలను వివరించారు. విభాగాధిపతి కోమల లక్ష్మి భారత అణు కార్యక్రమాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - గోపాలపురం


గురువారం తెల్లవారుజాము మండలంలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు రహదారులపై నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. సుమారు 2 గంటల పాటు కురిసిన భారీ వర్షంతో 40.2 మిల్లీమీటర్ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. వాదాలకుంట చెరువు నుంచి, పొలాల నుంచి తీవ్ర స్థాయిలో వర్షపు నీరు గోపాలపురంలోకి చేరుకుంది. దీంతో ఉప్పరగూడెంలో ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా డ్రయినేజీ వ్యవస్థ లేకపోవడంతో 1.5 కిలోమీటర్లు దూరం వరకు నీటి ప్రవాహం ఉండటంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. పంచాయతీ వెనక వీధి, కుమ్మరికుంట, రజకుల పేటలో వరద నీరు చేరడంతో తీవ్ర అవస్థలు పడ్డారు. పెద్దాపురం గ్రామంలోని ఎస్‌సి ఏరియాలో పలు వీధుల్లోకి వర్షపు నీరు ప్రవేశించింది. ఇళ్లల్లోకి సైతం నీరు చేరడంతో



రహదారిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామానికి చెందిన నాయకులు కొర్లపాటి అన్నవరం, గన్నిన మురళీ, పంచాయతీ కార్యదర్శి అలేఖ్య ఆధ్వర్యంలో వరద నీరు దిగువకు వెళ్లేపోయేలా చర్యలు తీసుకున్నారు. బాధితులకు నాయకులు భోజన వసతిని కల్పించారు. సమాచారం తెలుసుకున్న ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పెద్దాపురంలో పర్యటించారు. తుపాను బాధితులకు, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో టిడిపి మండల అధ్యక్షులు కొర్లపాటి రాము, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఐక్యతకు నిదర్శనం దేవదాయ కమిటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ



నియామక పత్రాన్ని ఇస్తున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలో కూటమి పార్టీల నేతల మధ్య ఐక్యతకు నిదర్శనంగా దేవదాయ కమిటీల నియామకం జరిగిందని ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం నగర టిడిపి కార్యాలయంలో వివిధ దేవస్థానాలకు నియమించిన కమిటీలను ఆయ. ప్రకటించారు. హితకారిణి సమాజం ట్రస్టు ఛైర్మన్‌గా డాక్టర్ యాళ్ళ ప్రదీప్‌కుమార్, ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్‌గా కొయ్యల రమణ ప్రకటించారు. హితకారిణి సమాజం డైరెక్టర్లుగా ఆదిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, మేడపాటి సాయి భాగ్యలక్ష్మి, కూచర్లపాటి లలితారాణి, గుణ్ణం శ్యామ్ సుందర్, చెరుకుమల్లి అనంత సత్యానాగవల్లి, కొడమళ్ళ శ్రీనివాసరావు, మంచెం విజయకుమార్, తణుకు శేషకుమారి, కిలారి వెంకట నాగలక్ష్మి, కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్లుగా పిల్లి ప్రసాద్, జొన్న సత్యవతి, అలజంగి దేవుడు, నిమిషకవి వెంకటేశ్వరరావు, గుబ్బల గంగాభవాని, జివిఆర్.రెడ్డి, తోట కిరణ్, ముద్దుకూరి అనురాధ, ముంగండ త్రివేణి, సమ్మంగి లక్ష్మీదుర్గలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛైర్మన్‌తోపాటు, కూటమి పార్టీల పక్షాన 11 మంది సభ్యుల చొప్పున నియమించామని చెప్పారు. నగరంలోని 14 దేవస్థానాలు ఉన్నాయని, వాటిలో ఇప్పటి వరకూ 12 కమిటీలను నియమించినట్లు చెప్పారు. త్వరలోనే చందా సత్రం, గౌతమీ జీవకారుణ్య సంఘం ట్రస్ట్ బోర్డులను ప్రకటిస్తామని చెప్పారు. వేణుగోపాలస్వామి దేవస్థానం ఛైర్మన్‌ను నియమించినా పున్న పరిశీలనకు వెళ్ళిందని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేనివిధంగా రాజమహేంద్రవరం అర్బన్‌లోనే కమిటీల నియామకం జరిగిందని వివరించారు. అందుకు సహకరించిన ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, ఎంఎల్‌సి సోము వీర్రాజు, జనసేన అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అనుశ్రీ సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.



బాధితునికి పోషకాహార కిట్టును అందిస్తున్న డాక్టర్ వసుంధర

క్షయ నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి - నిడదవోలు

2030 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని లెప్రసీ, ఎయిడ్స్, టిబి కంట్రోల్ జిల్లా అధికారి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వార్డుల్లో ఉన్న క్షయ బాధితులను కలుసుకుని మాట్లాడారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. టిబి విభాగంలో ఉన్న బాధితులకు పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధిని 2030 నాటికి పూర్తిగా నిర్మూలించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇంటెన్సిఫైడ్ టిబి ముక్త్ భారత్ అభియాన్ పేరుతో వంద రోజుల కార్యక్రమానికి వైద్యారోగ్య శాఖ శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిబి ఇంటెన్సిఫైడ్ క్యాంప్ జరుగుతుందని తెలిపారు. ఎవరికైనా టిబిపై అనుమానం ఉంటే కళ్లి పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆర్.పోతురాజు, రత్నకుమారి, డిపి ఎస్.లక్ష్మిసుందరి, డాక్టర్ హారిక, సిబ్బంది పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండగా టీచర్

ప్రజాశక్తి - కడియం



బాధితులకు భోజనాలు వడ్డిస్తున్న టీచర్

మండలంలోని వేమగిరి జాతీయ రహదారి పక్కన గుడారాల్లో జీవిస్తున్న తుపాను బాధితులకు వెంకాయమ్మపేట ప్రాథమిక పాఠశాల టీచర్ సాకా అనిత అండగా నిలిచారు. బుధవారం రాత్రి సుమారు 60 మందికి ఆమె భోజన వసతి కల్పించి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

బౌద్ధోత్సవ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - సీతానగరం

కోరుకొండ మండలం కాపవరం గ్రామ పరిధిలోని భౌద్ధ ఆరామం వద్ద నవంబర్ 8వ తేదీన నిర్వహించే బౌద్ధోత్సవ కరపత్రాన్ని గురువారం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఇనుగంటివారిపేట గ్రామంలోని బుద్ధవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ముని మనవడు రాజా రత్నా అశోక్ అంబేద్కర్ వస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంబేద్కరిస్టులు, బౌద్ధ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ మర్రి బాబ్జీ, కమిటీ అధ్యక్షులు సిహెచ్.సుబ్బారావు, ఆర్గనైజర్లు గుడిసె వనరాజు, బందిల దుర్గాప్రసాద్, బి.రత్నం, పి.మోహన్, కొంకి రమేష్, గొంతి కేశవ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైకుకు దుండగుల నిప్పు

ప్రజాశక్తి - గోపాలపురం

రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి సోమవారం తెల్లవారుజాము సమయంలో కొవ్వూరుపాడులో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం.. తన స్వగ్రామం కొవ్వూరుపాడులో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ సోమవారం తెల్లవారుజాము అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై డీజిల్ పోసి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగడంతో ఎదురింటి వాళ్లు కేకలు పెట్టడంతో మెలకువ వచ్చి మంటలను అదుపు చేశామని తెలిపారు. దీనిపై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన మద్దుకూరి సత్యనారాయణ (53) విద్యుదాఘాతంతో మృతి చెందారు. గురువారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు వెల్లడించారు. గురువారం ఉదయం ఇంటి నుంచి తన పొలంలోకి వెళ్తుతుండగా మార్గమధ్యంలో వేరొకరి పొలంలో విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైరుపై తాడి చెట్టు పడింది. ఆ చెట్టు నీటి బోదెకు అడ్డంగా ఉండటంతో ఆ వైరును పక్కకు వేసేందుకు చేత్తో పట్టుకున్నాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురయ్యి అక్కడికక్కడే అతను మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహానికి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించారు. మృతునికి భార్య నాగమణి, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన కొవ్వాడ బాబూరావుకు చెందిన కోళ్లను దొంగిలించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో నాటు కోళ్లను దొంగిలించిన ఆవుల గోపి, కొత్తపల్లి రమేష్, పిల్లల సురేంద్ర, మేడికొండ అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ.30 వేల విలువ చేసే కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీలపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణ శివారులో దండుగుండ ఇసుక ర్యాంపులో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో తెలంగాణ రాష్ట్రానికి ఇసుకను తరలిస్తున్న మూడు లారీలపై కేసు నమోదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. ఈనెల 23వ తేదీన గనులు భూగర్భ శాఖాధికారి ఫణిభూషణ్‌రెడ్డి, ఇతర విజిలెన్స్ అధికారులతో కలిసి ర్యాంపులో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉన్న మూడు లారీలను గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రసాయన వాయువుల లీకేజీపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణ శివారుణ ఉన్న గ్రామం ఇండియా టోల్ ప్లాజా వద్ద ట్యాంకర్ లారీ నుంచి హైడ్రోక్లోరైడ్ ఆమ్లం లీకేజీ అవుతుండడంపై గురువారం కేసు నమోదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. బలబద్రపురంలో గ్రాసింగ్ ఇండస్ట్రీస్ నుంచి చెన్నై వెళుతున్న ట్యాంకర్ లారీ కొవ్వూరు వచ్చేసరికి హెచ్‌సిఎల్ గ్యాస్ లీక్ అవుతుంది. టోల్ ప్లాజా వద్దకు వచ్చేసరికి గ్యాస్ లీకేజ్ అధికంగా ఉండి పొగలు వచ్చుచుండడంతో ఆ ప్రాంతంలో ఉన్నవారికి వాంతులు, కళ్ళు మంట తలనొప్పి వంటి సమస్యలతో ఇబ్బంది పడ్డారు. దీంతో టోల్ ప్లాజా మేనేజర్ జితేంద్ర రాణా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్నం కెనాల్ రోడ్డు ప్రధాన రహదారికి పడిన గోతులు వర్షపు నీటితో గురువారం ఆటో బోల్తా పడింది. కాకినాడ ప్రధాన రహదారికి సామర్లకోట మండలం వికె.రాయపురం నుంచి మాధవపట్టణం దాటేంత వరకు విపరీతంగా గోతులు పడగా గురువారం తెల్లవారు జామునుంచి కురిసిన భారీ వర్షాల కారణంగా ఆ గోతులన్నీ నీటితో నిండుకున్నాయి. కాగా ఈ రోడ్డులో ప్రయాణం చేస్తున్న ఒక ఆటో గోతిలో పడి ప్రమాధానికి గురైంది. దీంతో ఈ రహదారిపై వెళుతున్న వాహనదారులు భయంతో రాకపోకలు సాగించారు.



నమూనాలను పరిశీలిస్తున్న కమిషనర్

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ రాహుల్ మీనా హెచ్చరించారు. గురువారం దానవాయిపేట, పప్పుల వీధి, పందిరి వారి వీధి, సాయికృష్ణ థియేటర్ రోడ్డు, కంచుమర్తి వారి వీధుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల నిర్మించిన రోడ్ల నాణ్యతను పరిశీలించారు. నాణ్యమైన మౌలిక వసతులు అందించడంలో ఎలాంటి రాజీపడవద్దని ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ఈ పర్యటనలో ఇన్‌ఛార్జ్ ఎస్ఇ రీటా, ఇఇ మాధవి, ఎఇలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భయపెడుతున్న గ్రామ సింహాలు

బెంబేలెత్తుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని ఏ గ్రామానికి వెళ్లిన గ్రామ సింహాలు విహారం చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలపై మూకుమ్మడి దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో చిన్నపిల్లల తల్లిదండ్రులు తీవ్రభయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కడియపులంక, కడియం, వేమగిరి, కడియపు సావరం తదితర గ్రామాల్లోని వీధుల్లో శునకాలు గుంపులు, గుంపులుగా కలియ తిరుగుతుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే హడలెత్తిపోతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఏప్రిల్ నెలలో 120 మంది, మే నెలలో 119 మంది, జూన్‌లో 118 మంది, జూలైలో 99 మంది, ఆగస్టులో 93 మంది, సెప్టెంబర్ నెలలో 133 మంది కుక్కకాటుకు గురై కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు ఆసుపత్రి రికార్డులు తేటతెల్లం చేస్తున్నాయి. ఒక్క కడియం ప్రభుత్వ ఆసుపత్రిలోనే కుక్కకాటుకు గురైన వారి సంఖ్య ఈ స్థాయిలో ఉంటే ప్రయివేట్ ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రులు, పెద్దఆసుపత్రుల్లో కుక్క కాటుకు చికిత్స పొందిన వారి సంఖ్య ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ద్విచక్ర వాహనాలు, సైకిల్‌పై వెళుతున్న వారిని కుక్కలు వెంబడించి తరవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలుపాలై, కుక్కకాటుకు గురైన సందర్భాలు ఉన్నాయి. సంబంధింత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే ఎవరికి చెప్పాలో తెలియడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు నియంత్రణకు చర్యలు చేపట్టాలని, కుక్కల దాడుల నుంచి రక్షించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

గ్రామాల్లో ఉన్న కుక్కలను గుర్తించి వాటికి కుటుంబ నియంత్రణ తోపాటు, యాంటీ రేబిస్ వాక్సిన్లు వేయించాల్సిన పశుసంవర్ధక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కుక్కలను నిర్మూలించడం (చంపడం) సాధ్యం కాదనే కుంటి సాకుతో అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అధికారిక సమాచారం మేరకు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయాలంటే ప్రాంతీయ పశువుల ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటర్లు ఉండాలి. అలాగే ఆపరేషన్ అనంతరం వారం రోజులు పరిశీలన, సంరక్షణ చేపట్టాల్సి ఉంటుంది. ఒక్కో ఆపరేషన్‌కు సుమారు రూ.1600 ఖర్చు అవుతున్నట్లు అంచనా. ఇవి జరగాలంటే స్థానిక సంస్థలు నిధులు సమకూర్చుకోవాల్సివుంది.



కడియపులంక రోడ్ల పై తిరుగుతున్న కుక్కలు

రక్షణ కల్పించాలి



గ్రామాల్లో ప్రజలు కుక్కల నుంచి రక్షణ లేకుండా పోతుంది. రక్షణ కల్పించాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉంది. కుక్కల నియంత్రణ, వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి.

-సాపిరెడ్డి కామేష్, కడియపుసావరం

ఉద్యోగుల నిరసనకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

వాణిజ్య పన్నుల శాఖ చిత్తూరు సబ్ డివిజనల్ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డి నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా ఉద్యోగులు చేపట్టిన నిరసనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.గిరిప్రసాద్‌వర్మ, విల్సన్‌పాల్ తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం వాణిజ్య పన్నుల శాఖ ఆర్యాపురం సర్కిల్ కార్యాలయంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన దగ్గర పనిచేసే ఆఫీస్ సబార్డినేట్లు ఎ.లవకుమార్, కె.భరత్‌లను కులం పేరుతో దూషించడంతోపాటు, భౌతిక దాడికి పాల్పడిన రవీంద్రనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేసి శాఖాపరమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జిఎస్.రమేష్, జి.గోపాలకృష్ణ, రాజమహేంద్రవరం రూరల్ తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌విఎస్.రాజు, పి.మురళీకృష్ణ, కెఎన్.మూర్తి, నాయకులు వి.భద్ర, ఎ.రెహ్మాన్, జి.అనిత పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు



ద్విచక్రవాహనాన్ని అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రోత్సాహక బహుమతుల అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్రముఖ ఆచి మసాలా కంపెనీ రిటైల్ వ్యాపారులకు ప్రోత్సాహక బహుమతులు అందచేసింది. గురువారం స్థానిక టివిఎస్ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పిఎన్.శ్రీనివాస్ పాల్గొని పలువురు రిటైల్ వ్యాపారులకు ప్రోత్సాహక బహుమతులుగా టివిఎస్ మోటార్ సైకిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కంపెనీ ఉత్పత్తుల అమ్మకాలను పెంచిన రిటైల్ వ్యాపారులకు రాష్ట్ర వ్యాప్తంగా 118 టివిఎస్ మోటార్ సైకిల్స్‌ను పంపిణీ చేశామన్నారు. ఏడాదికి రూ.10 లక్షల వరకు ఆచి మసాలా వ్యాపారాన్ని చేసిన రీటైల్ వ్యాపారులకు ఈ ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఆర్ఎస్ఎం హనుమ, డిప్యూటీ ఎస్ఎం కిరణ్, డిస్ట్రిబ్యూటర్లు సుబ్బారావు, సుందర్, చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్స్ సర్వే

ప్రజాశక్తి - పెరవలి, చాగల్లు

పెరవలి మండలంలో తుపాను ప్రభావిత గ్రామాల్లో పారిశుధ్యం ఫీవర్ సర్వేను చేపట్టారు. గురువారం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.హేమరాజు, డాక్టర్ పి.తేజశ్రీ ఆధ్వర్యంలో ఆయా పంచాయతీల సిబ్బంది పారిశుధ్య ఫీవర్ సర్వేను చేపట్టారు. నడుపల్లి గ్రామంలో వీధుల్లో బ్లీచింగ్ చల్లించి ఎక్కడ నీరు నిల్వ లేకుండా చేయించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ కె. జయమణి, ఎంపిహెచ్ఇఒ కె.రాజమోహన్, సూపర్‌వైజర్ కెవి. నాగేశ్వరరావు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చాగల్లు మండల పరిధిలోని పలు గ్రామాల్లో డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రావణ్‌కుమార్ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేశారు. గ్రామాల్లో చెత్తను తొలగించే కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రవరం, మల్లవరం పంచాయతీలలో నిర్వహించిన కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కమలావతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గోపి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పెరవలిలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది



సభలో మాట్లాడుతున్న సత్యనారాయణ సాహూ

జోనల్ స్థాయిలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - గోకవరం

పాలసీల సేకరణలో జోనల్ స్థాయిలో గోకవరం ఎల్ఐసి బ్రాంచ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురువారం బ్రాంచ్ కార్యాలయంలో సీనియర్ డివిజన్ మేనేజర్ సత్యనారాయణ సాహూ కేక్ కట్ చేసి సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజన్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్, సేల్స్ మేనేజర్ మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జోన్‌లో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సూర్యనారాయణ, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కోటేశ్వరరావును సత్కరించారు. భవిష్యత్‌లోనూ ఇదే వరవడిని కొనసాగించాలని సూచించారు. అలాగే ప్రతిభ కనబరిచిన ఏజెంట్స్ లక్ష్మణరావు, కె.నాగేశ్వరావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ సెక్రెటరీ నాగారపు నాగరాజు, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ,సెక్రెటరీ ఎం.రవీంద్ర, సీనియర్ ఎల్ఐసి ఏజెంట్ తలారి సూర్యప్రకాశరావు, మెప్పెల్లి జయరాజు పాల్గొన్నారు.

7న రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఈ ఏడాది నవంబర్ 7న కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో జిల్లా రెడ్‌క్రాస్ శాఖలో సభ్యత్వం కలిగిన పేట్రాన్, వైస్ పేట్రాన్, లైఫ్ మెంబర్స్, లైఫ్ అసోసియేట్ సభ్యులు పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తూర్పు గోదావరి జిల్లా శాఖకు నూతన మేనేజ్‌మెంట్ కమిటీని నియమించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన ఛాంబర్ ప్రతినిధులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం సిటీ

ది రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఛాంబర్ అధ్యక్షులు తవ్వా రాజా, ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీను, మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు తదితరులు పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగరానికి వచ్చే యాత్రికుల తాకిడితో ఏర్పడే ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఓల్డ్ సిటీకి ఏం కాకుండా చూడాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఛాంబర్ పాలకవర్గం సభ్యులు తోట లక్ష్మీనారాయణ, హనుమాన్ సింగ్, పులవర్తి వెంకటేష్, ఇయ్యపు మురళీధర్, నూలు శివ, గునిశెట్టి విజయ్‌కిరణ్, ఒంటెద్దు సూరిబాబు ఉన్నారు.



కమిషనర్ రాహుల్ మీనాను సత్కరిస్తున్న ఛాంబర్ ప్రతినిధులు

రసాయన వ్యర్థాలు వేస్తే చర్యలు

ప్రజాశక్తి - కొవ్వూరు

ఐ.పంగిడి శివారు దేచెర్ల గ్రామ సమీపంలోని క్వారీ గోతుల్లో రసాయనిక వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని ఆర్‌డిఒ రాణి సుస్మిత హెచ్చరించారు. కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదుపై గురువారం ఆర్‌డిఒ ఆధ్వర్యంలో అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఐ. పంగిడి గ్రామ పరిసరాల్లో ఉన్న క్వారీలలో అక్రమంగా తవ్వకాలు జరిపి, 150 అడుగుల లోతు వరకు ఉన్న ఖనిజ సంపదను తవ్వి, ఆ క్వారీ గోతులను సక్రమంగా మట్టితో పూడ్చకుండానే వదిలి వేయడాన్ని గుర్తించారు. ఆ గోతుల్లో చెత్త, కొన్ని పరిశ్రమల నుంచి వెలువడే కెమికల్స్‌ను పారబోయడం వలన పరిసర ప్రాంతాల్లో కాలుష్య సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని గుర్తించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటన వివరాలతో నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శంకరరావు పాల్గొన్నారు.



రసాయన వ్యర్థాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నగరంలోని 13వ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లోని మాజీ కార్పొరేటర్ కప్పల వెలుగుకుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు పుట్టిన రోజును పురస్కరించుకుని భాను తేజస్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, రేవతి హాస్పటల్ సంయుక్త సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు కప్పల వెలుగు కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశీ నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య. మహ్మద్ అబ్దుల్లా, మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ, తురకల నిర్మల పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని శేషయ్య మెట్ట, క్వారీ మార్కెట్ జంక్షన్‌లోని అన్న క్యాంటీన్‌లను నగర కమిషనర్ రాహుల్ మీనా గురువారం తనిఖీలు చేశారు. భోజనాలు చేస్తున్న వారిని కలుసుకుని భోజన పదార్థాలు రుచిగా ఉంటున్నాయా? లేవా? అంటూ ఆరా తీవారు. అనంతరం ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

పేదలకు సొంతింటిని ఏర్పాటు చేసేలా కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రతీ పేద కుటుంబానికి సొంతింటిని కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎపి గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ప్రియా సౌజన్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ సంస్థ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ నాతి.బుజ్జి, ఇతర అధికారులు జిల్లాలో జరుగుతున్న గృహనిర్మాణ కార్యక్రమాలను ఆమెకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలకు పిఎం ఆవాస్ యోజన పథకంలో గృహ నిర్మాణం వేగవంతం చేయాలని అన్నారు. అర్హులైన కుటుంబాలు తమ ప్రాంతంలోని గహనిర్మాణ శాఖ ఎఇ కార్యాలయాలు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుల ద్వారా ఆవాస్ ప్లస్ యాప్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాతి.బుజ్జి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,794 గృహాల లక్ష్యానికి 7,394 గృహాలు పూర్తై 69 శాతం పురోగతి సాధించామని తెలిపారు. మిగిలిన 3,400 గృహాలను నవంబర్ చివరినాటికి పూర్తి చేయడానికి అన్ని నియోజకవర్గాల హౌసింగ్ ఇంజనీర్లు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహక ఇంజనీర్ సిహెచ్.వేణుగోపాలస్వామి, హౌసింగ్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కెఎస్.చక్రవర్తి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు బాలుర జట్ల ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో బాలుర అండర్ 14, 17 జట్లును గురువారం ఎంపిక చేశారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన ఎంపిక పోటీలను హెచ్ఎం ఎంవిఎం.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జయ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ చెస్, యోగ, విభాగాలలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్లు డివిజనల్ స్థాయికి వెళ్తాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎవిడి.ప్రసాదరావు తెలిపారు. ఈ పోటీల్లో జోన్ సెక్రెటరీ డి.విజయవిక్టర్, జాయింట్ సెక్రెటరీ వి.వెంకటేశ్వరరావు, పి.సుధాకర్, ఇ.బాలసుంకయ్య, శారద, కల్పన, కళావతి, చక్రవర్తి పాల్గొన్నారు.